# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **కీలక వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్-ఆర్ బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు.**
2. **రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నీరభ్ కుమార్ ప్రసాద్ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు.**
3. **ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా పార్లమెంటు సభ్యులు పని చేయాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సూచించారు.**
4. **లోక్ సభ ఎన్నికలు ముగిసినందున అమల్లో ఉన్న ఎన్నికల ప్రవర్తన నియమావళి నిలుపుదల చేస్తున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.**
5. **రాష్ట్రంలో రానున్న రెండు రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.**

==========================

కీలక వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్- ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు. ముంబైలో ఈరోజు ద్వైమాసిక ద్రవ్యపరపతి కమిటీ విధాన సమీక్ష నిర్ణయాలను వెల్లడించారు.రెపోరేటును 6.5 శాతం వద్ద స్థిరంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు 7.5 శాతంగా అంచనా వేస్తున్నన్నట్లు తెలిపారు. ద్రవ్యోల్బణాన్ని 4 శాతం దిగువకు తీసుకురావడానికి ఆర్‌బీఐ కట్టుబడి ఉందని తెలిపారు. ద్రవ్యోల్బణం, వృద్ధి మధ్య సమతుల్యత అనుకూలంగా ఉందని వివరిస్తూ..

..వాయిస్.. 32 సెకన్లు

--------------------------

వెలగపూడి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నీరభ్ కుమార్ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. కాగా.. ఇప్పటివరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కె.ఎస్.జవహర్ రెడ్డిని బదిలీ చేయగా.. ఆయన స్థానంలో నీరభ్ కుమార్ ప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన నీరభ్ కుమార్ ప్రసాద్ 1987 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి.

--------------------------

రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా నూతనంగా ఎన్నికైన పార్లమెంటు సభ్యులు పని చేయాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సూచించారు. నిన్న ఉండవల్లిలో నూతన ఎంపీలతో టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ప్రజలు ఇచ్చిన అధికారాన్ని బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. తమ నియోజకవర్గాల్లో ఉన్న ప్రధాన సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

---------------------------

లోక్ సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో మార్చి 16వ తేదీ నుంచి అమల్లో ఉన్న ఎన్నికల ప్రవర్తన నియమావళి గత సాయంత్రంతో ముగిసిందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. కాగా పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గాల నుండి శాసనమండలికి ద్వైవార్షిక, ఉప ఎన్నికల కారణంగా కర్ణాటక, – మహారాష్ట్ర, తెలంగాణాలోని పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గాలలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఇప్పటికీ అమలులో ఉంటుందని కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థుల వివరాలను కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు- సుఖ్‌బీర్ సింగ్ సంధూ, జ్ఞానేశ్ కుమార్ నిన్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు సమర్పించారు. 18వ లోక్‌సభ ఏర్పాటులో భాగంగా రాష్ట్రపతి భవన్‌లో నూతన సభ్యుల జాబితాను అందజేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారంటూ ఎన్నికల కమిషనర్లను రాష్ట్రపతి అభినందించారు. స్వేచ్ఛగా, నిజాయతీగా ఎన్నికల్ని నిర్వహించిన సిబ్బందిని, పోలీసులు సహా కేంద్ర-రాష్ట్ర భద్రతా బలగాలు అవిశ్రాంతంగా అందించిన సేవల్ని యావద్దేశం తరపున రాష్ట్రపతి అభినందించారని ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయుల బదిలీలపై ఎన్నికల నియమావళికి ముందు ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేస్తున్నట్లు పాఠశాల విద్యా శాఖ వెల్లడించింది. ఎటువంటి ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టవద్దని జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశిస్తూ ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలకు ముందు మొత్తం 1800 మంది టీచర్లను బదిలీ చేయాలని గత ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వగా బదిలీలపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

---------------------------

ప్రధాన మంత్రి నరేంద్రమోదీని ఎన్డీయే పక్ష నేతగా ఎన్నుకునేందుకు ఆ కూటమి తరపున గెలిచిన పార్లమెంట్ సభ్యులు ఢిల్లీలోని పాత పార్లమెంటు భవనం సెంట్రల్ హాల్లో ఈ రోజు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్‌లతో పాటు రాష్ట్రం నుంచి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన్ కళ్యాణ్‌తో పాటు ఎన్డీయే ఇతర ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఢిల్లీలో జరుగుతున్న ఈ సమావేశంలో ఎన్డీయే పక్ష నేతగా నరేంద్రమోదీని సమర్థిస్తూ పార్లమెంట్ సభ్యులు ఏకగ్రీవ తీర్మానంతో అధికారంగా ఎన్నుకోనున్నారు.

---------------------------

విశ్వసనీయతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పునర్ వైభవానికి పునాదిగా నిలుస్తుందని ఆ పార్టీ అధ్యక్షులు వై. యస్. జగన్ మోహన్ రెడ్డి అన్నారు. వైసీపీ నుంచి గెలుపొందిన శాసనసభ సభ్యులు, పార్లమెంట్ సభ్యులతో నిన్న తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో జగన్ మోహన్ రెడ్డి సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్ల పరిపాలనను రాబోయే పాలనతో ప్రజలు బేరీజు వేసుకుంటారని పేర్కొన్నారు. ఇంతటి పోటీలోనూ వైసీపీకి 40 శాతం ఓట్లు లభించాయన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో సంక్షేమానికి పెద్దపీట వేయడంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని తెలిపారు.

---------------------------

బ్రిటిష్ కాలం నాటి నేర న్యాయవ్యవస్థ స్థానంలో నూతనంగా రూపొందించిన మూడు నేర చట్టాలు ఈ ఏడాది జులై 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. ఇప్పటివరకు అమల్లో ఉన్న భారతీయ శిక్షాస్మృతి, నేరశిక్షా స్మృతి, భారత సాక్షాదారి చట్టం 1872లో స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరికత సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్ చట్టాలను వర్తింపజేయనున్నారు. ఈ క్రమంలో కొత్త నేర చట్టాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని తిరుపతికి చెందిన న్యాయవాదులు ఉమా, గోపాల్ ఆకాశవాణికి వివరిస్తూ,

..వాయిస్ ..30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని కృష్ణా జిల్లా పెనమలూరుకు చెందిన యువరైతు ఎన్. రఘువీర్‌కు భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ-ఐఏఆర్ఐ వినూత్న రైతు అవార్డు-2024ను అందజేసింది. ఢిల్లీలో నిన్న జరిగిన జాతీయ కృషి విజ్ఞాన కేంద్రాల మేళాలో ఐఏఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఏకే సింగ్ ఈ అవార్డును రఘువీర్‌కు ప్రదానం చేశారు. ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డును ఆంధ్రప్రదేశ్ నుంచి అందుకున్న ఆదర్శ రైతుగా రఘువీర్ నిలిచారు. అంతరించిపోతున్న పురాతన ధాన్యపు విత్తనాలను సంరక్షించి విత్తన నిధులను ఏర్పాటు చేసినందుకుగానూ ఈ పురస్కారాన్ని అందజేసినట్లు అధికారులు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి డి.శేష సాయి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 32 సెకన్లు...

---------------------------

దేశంలో ఉష్ణోగ్రతలు, వేడి గాలులపై సంసిద్ధత, వేసవి కాలంలో ఆసుపత్రులలో అగ్నిప్రమాదాల నివారించడానికి చేపట్టిన చర్యలపై రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సమీక్ష సమావేశం నిర్వహించింది. ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ డాక్టర్ అతుల్ గోయెల్ అధ్యక్షతన నిన్న ఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా వివిధ ఆరోగ్య సంరక్షణ, వైద్య సౌకర్యాల కోసం అవలంబిస్తున్న విధానాలు, అగ్ని, విద్యుత్ వంటి వాటిపై తీసుకుంటున్న భద్రతా చర్యల గురించి చర్చించారు. ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఉన్నత స్థాయి అధికారులు ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో వేడి గాలులపై నిరంతరం పర్యవేక్షిస్తున్నారని అధికార వర్గాలు తెలిపాయి.

======================